సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 13 । ఆగస్టు । 2024



పర్యాటకులను ఆకర్షించేలా

పర్యాటకులను ఆకర్షించేలా పార్కులను తీర్చిదిద్దాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ ఆదేశించారు. 8లో



ఎయిడ్స్ నియంత్రణకు ప్రచారం

ఎయిడ్స్ నియంత్రణకు అధికారయంత్రాంగం విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ సూచించారు. 8లో



తవ్వే కొద్దీ నష్టాలే.!

డ్రెడ్జింగ్ కార్పొరేషన్ వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. అధికారులు స్వలాభం కోసం సంస్థకు నష్టాలు తెస్తున్నారు. 8లో

నాకూ కావాలి మేయర్ పీఠం



నెలకు ఎమ్మెల్యేకు రూ.5 లక్షలు.. కార్పొరేటర్‌కు రూ.లక్ష

కూటమి నేతలకు జనసేన కార్పొరేటర్ బంపర్ ఆఫర్

'నీకు రూ.15 వేలు... నీకు రూ.15 వేలు... నీకు 18 వేలు' అంటూ ఎన్నికల ముందు టీడీపీ నేత చెప్పిన హామీలు ఇప్పుడు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. మరి దీనినే స్ఫూర్తిగా తీసుకున్నాడో ఏమో విశాఖ నగర మేయర్ పీఠం తనకిస్తే.. నీకు రూ.5 లక్షలు... నీకు రూ.5 లక్షలు... నీకు రూ.లక్ష అంటూ సదరు కార్పొరేటర్ కాస్తా ఏకంగా ఎమ్మెల్యేలకు, సహచర కార్పొరేటర్లకు బంపర్ ఆఫర్ ఇచ్చాడు.

'నేనేంటో మీకు తెలుసు.. నా పవర్ ఏంటో మీరు ఇప్పటికే గ్రహించి ఉంటారు. అందుకే కూటమి తరఫున మేయర్ పీఠం నాకు ఇవ్వండి. మీకు ఎలాంటి లోటు రాకుండా నేను చూసుకుంటాను' అని భరోసా ఇచ్చాడు. ఎమ్మెల్యేలూ.. మీకు రూ.5 లక్షలు.. సహచర కార్పొరేటర్లూ మీకు రూ.లక్ష.. ఇదిగిదిగో ఈ మధ్యే కూటమితో జతకట్టిన ఈ కార్పొరేటర్‌కూ లక్ష రూపాయలు చొప్పున నెలకు ఇస్తాననడం ఇదే ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది.

- మేయర్ పదవి ఇప్పిస్తే అన్నీ చూసుకుంటానని జనసేన కార్పొరేటర్ హామీ
- ఎమ్మెల్యేలకు, కూటమి కార్పొరేటర్లకు నెలవారీ మామూళ్లు ఇస్తానంటూ ఆఫర్
- సూపర్ ఆఫర్‌తో ఆలోచనలో పడ్డ కూటమి వర్గం
- ఆ కార్పొరేటర్ డేంజర్ అంటూ తిరస్కరించిన మరికొందరు



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

మహా విశాఖ నగర పాలక సంస్థకు 2021లో జరిగిన ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో విజయం సాధించిన వైఎస్సార్ సీపీ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంది. అయితే ఇటీవల జరిగిన పరిణామాలతో ఆ పార్టీ బలం కాస్తా తగ్గింది. టీడీపీ, జనసేన, బీజేపీ కార్పొరేటర్ల సంఖ్య పెరగడంతో మేయర్ పీఠాన్ని దక్కించుకోవాలనే ప్రయత్నాలు మొదలయ్యాయి. కానీ ప్రభుత్వం చేసిన చట్ట ప్రకారం వచ్చే మార్చి నెల వరకు మేయర్‌ను కదిపే అవకాశం లేదు. నాలుగేళ్ల పదవీ కాలం పూర్తయ్యేంత వరకూ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టరాదన్న నిబంధన ఉంది. ఈలోపే ఆ కుర్చీపై ఎవరు కూర్చోవాలనే విషయంపై కూటమిలో చర్చోపచర్చలు జరుగుతున్నాయి.

ఇటీవల జరిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికల సందర్భంగా నగరంలోని కూటమి కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఎలా గెలవాలన్న అంశంపైనే అందరూ సీరియస్‌గా చర్చిస్తుంటే... ఓ జనసేన కార్పొరేటర్ మాత్రం తన గురి మేయర్ కుర్చీపై ఉందని ఓపెన్ అయిపోవడంతో అంతా నిర్ఘాంతపోయారు. తమ పార్టీకి స్టాండింగ్ కమిటీలో ఒక్క స్థానం కూడా ఇవ్వలేదు.. మేయర్ పీఠం మాత్రం తమకే కావాలనే ప్రతిపాదన ఈ సందర్భంగా ఆయన చేసినట్టు తెలుస్తోంది.

ఇంటికే ప్యాకేజీ..!



సదరు కార్పొరేటర్ మాటలను కూటమి ఎమ్మెల్యేలు, తోటి కార్పొరేటర్లు కొట్టిపారేయగా.. ఆయన మాత్రం "నేను కాన్ఫిడెంట్‌గానే చెబుతున్నాను.. నాకు మేయర్ పీఠాన్ని ఇవ్వండి.. మీరు ఇప్పటివరకు చూడని రిటర్న్స్ మీకు చూపిస్తాను. ఎవరికీ లోటు రానివ్వను. ఒక్కో ఎమ్మెల్యేకి నెలకు రూ.5 లక్షలు, కార్పొరేటర్లకు నెలకు రూ.లక్ష చొప్పున ప్యాకేజీ ఇస్తాను. నెల నెలా జీతం వచ్చినట్లు ఒకట్రెండు తేదీల్లోగా నేరుగా మీ ఇంటికే డబ్బులు వచ్చేస్తాయి. అందులో ఎలాంటి మొహమాటం లేదు" అని స్పష్టంగా తేల్చిచెప్పినట్టు సమాచారం. ఎలా వస్తాయని మాత్రం మీరు అడగొద్దు... మీకెవ్వరికీ లోటు రాకుండా చూసుకునే బాధ్యత నాకు వదిలెయ్యండని స్పష్టంగా చెప్పినట్టు తెలుస్తోంది. ఎవరి దగ్గర నుంచి ఎలా లాగెయ్యాలో నాకు తెలిసినంతగా ఇక్కడున్న ఏ సీనియర్ కార్పొరేటర్‌కీ అవగాహన లేదని కూడా కుండబద్దలు కొట్టినట్టు స్పష్టంగా తేల్చిపడేయడంతో ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లందరూ విస్తుపోయినట్టు ప్రచారం జరుగుతోంది.

అమ్మో.. ఆయనతో డేంజర్ !



అప్పటి వరకూ అందరి మాటలతో హడావుడిగా ఉన్న సమావేశ మందిరం జనసేన కార్పొరేటర్ ఆఫర్‌తో మూగబోయింది. ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు నోరెళ్లబెట్టారు. ఇంత కాన్ఫిడెంట్‌గా అవినీతికి రెడ్ కార్పెట్ పరిచేస్తానని చెబుతున్న కార్పొరేటర్ మాటలతో కొందరు నిశ్చేష్టులవ్వగా.. మరికొందరు గుసగుసలాడుకున్నారు. ఇంకొందరు ఇదేదో ఆఫర్ బాగుంది కదా.. మన చల్ల కదలకుండా నెలకు రూ.లక్షలు రావడమంటే మాటలు కాదంటూ ఆసక్తి కనబరిచారు. ఏదో ఒక విషయం ఆలోచించి చెప్పండంటూ ఆ కార్పొరేటర్ సమావేశం నుంచి బయటకు వెళ్లగానే.. అమ్మో.. ఆడో డేంజర్ క్యాండేట్. ఆయన పేరు ప్రచారంలోకి వస్తే పిచ్చోడి చేతికి రాయిచ్చిన ట్లేనంటూ వ్యాఖ్యానించినట్టు సమాచారం. మొత్తంగా వచ్చే ఏడాదిలో అది కూడా అవిశ్వాస తీర్మానం పెట్టి నెగ్గితే వచ్చే మేయర్ పీఠం కోసం టీడీపీ నుంచి మాత్రమే పోటీ ఉంటుందని భావిస్తున్న సందర్భంలో అనూహ్యంగా జనసేన కార్పొరేటర్ తెరమీదకు రావడం మాత్రం కూటమిలో కొత్త చర్చకు తెరలేచిందని చెప్పవచ్చు.

ఎమ్మెల్సీ స్థానానికి బొత్స నామినేషన్



స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, చిత్రంలో అరకు ఎంపీ తనూజరాణి, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ

మహారాణిపేట : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి సోమవారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. మధ్యాహ్నం 1.45 గంటలకు మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కలెక్టరేట్‌కు చేరుకొని ఆర్వో కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్‌కు మూడు సెట్ల నామినేషన్ పత్రాలు సమర్పించారు. బొత్స వెంట ఆయన సతీమణి బొత్స ఝాన్సీ, అరకు ఎంపీ తనూజ రాణి, మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడు, నగర మేయర్ హరి వెంకట కుమారి ఉన్నారు. నామినేషన్ దాఖలు చేసిన వెంటనే సంప్రదాయం ప్రకారం బొత్స సత్యనారాయణ ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, కె.కన్నబాబు, సమన్వయకర్తలు వాసుపల్లి గణేష్‌కుమార్, కె.కె.రాజు, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, పార్టీ నాయకులు రవిరెడ్డి, ఈర్లె అనురాధ, డాక్టర్ జహీర్ అహ్మద్, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు సుంకరి గిరిబాబు, డిప్యూటీ మేయర్ కె.సతీష్, తదితరులు పాల్గొన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా షేక్ షఫీ ఉల్లా తన మద్దతుదారులతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. ఒక సెట్ పత్రాలను ఆర్వోకు అందజేశారు.

అఫిడవిట్‌లో ఇలా..

బొత్స సత్యనారాయణ అఫిడవిట్‌లో రూ.2.87 కోట్లు అప్పులు ఉన్నట్లు పేర్కొన్నారు. తనతోపాటు తన భార్య ఆస్తులు కలిపి మొత్తం రూ.21.32 కోట్లు ఉన్నట్లు తెలిపారు. చేతిలో తన వద్ద నగదు రూ.4.61 లక్షలు, భార్య వద్ద రూ.4.50 లక్షలు ఉన్నట్లు పేర్కొన్నారు. తన పేరున రూ.21.15 లక్షలు విలువ చేసే 31 తులాల బంగారం, భార్య పేరున రూ.2.15 కోట్లు విలువ చేసే 325 తులాల బంగారం ఉందని తెలిపారు. తన పేరున ఒక కారు, భార్య పేరున రెండు కార్లు ఉన్నట్టు అఫిడవిట్‌లో ప్రస్తావించారు.

ఉక్కు ఉద్యోగులపై 'పొదుపు' కత్తి!

- ఆర్థిక ప్రయోజనాల కోతకు సిద్ధం
- ఉత్పత్తిపై దృష్టిసారించని యాజమాన్యం
- బోనస్, పీఆర్‌పీ, ఈఎల్స్ ఎన్‌క్యాష్‌మెంట్ నిలుపుదలకు మొగ్గు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘాలు



సాక్షి, విశాఖపట్నం: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుటిల యత్నాలు ముమ్మరం చేస్తుంటే.. ఉద్యోగుల ప్రయోజనాలను దెబ్బతీసేందుకు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం సిద్ధమవుతోంది. ప్లాంట్‌లో ఏ చిన్న ఆర్థిక సమస్య వచ్చినా ఉద్యోగులు, కార్మికుల వేతనాలు, ఇతర ప్రయోజనాలను తగ్గించడమే లక్ష్యమన్నట్టుగా వ్యవహరిస్తోంది. దీంతో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది. 2021 జనవరిలో స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలనే ప్రతిపాదన వచ్చిన నాటి నుంచి ఉద్యోగుల తలరాతలు పూర్తిగా మారిపోయాయి.

ముప్పేటి దాడితో నష్టాల బాట

ప్రైవేటీకరణ నిర్ణయం తర్వాత ప్లాంట్‌పై ముప్పేట దాడి ప్రారంభమైంది. కేంద్ర ప్రభుత్వం ఒకవైపు రా మెటీరియల్ అందించక పోవడంతో పాటు అవసరమైన రేల్వే ర్యాక్‌లు ఇవ్వకుండా కర్మాగారాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నాలు మొదలెట్టింది. మరో వైపు ఆర్థిక భారం నుంచి గట్టెక్కించేందుకే అంటూ.. ప్లాంట్‌కు సంబంధించిన ఆస్తుల విక్రయానికీ పావులు కదుపుతోంది. మరోవైపు బ్యాంకుల నుంచి రుణాలు అందకుండా చేస్తూ స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల్లోకి నెట్టింది. 3 బ్లాస్ట్‌ఫర్నేసులకు గాను 2 ఫర్నేసుల్లో మాత్రమే ఉత్పత్తి జరుగుతోంది. దీంతో అనుకున్న ఉత్పత్తి లేకపోవడంతో టర్నోవర్ తగ్గిపోయింది. ప్రస్తుతం ప్లాంట్‌లో రా మెటీరియల్ నిల్వలు అడుగంటడంతో వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగా ఉద్యోగులకు సంబంధించిన ప్రయోజనాల్లో కోత విధిస్తూ పొదుపు చర్యలకు సిద్ధమవుతున్నట్టు యాజమాన్యం చెప్పకనే చెబుతోంది.

ఆర్నెళ్ల నుంచి వేతన కష్టాలు

ప్లాంట్ నష్టాల బాట పట్టడంతో ఆర్నెళ్లగా ఉద్యోగులు జీతం ఒకేసారి అందుకున్న దాఖలాలు లేవు. సగం జీతం కూడా నెలాఖరున చెల్లిస్తుండడంతో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. సకాలంలో వాయిదాలు చెల్లించలేక డీఫాల్టర్లుగా మారుతున్నారు. 2017 జనవరి 1న వేతన ఒప్పందం జరగక పోవడంతో సగటు ఉద్యోగి ప్రతీ నెలా కనీసం రూ. 10 వేల నుంచి రూ. 30 వేల వరకు నష్టపోతున్నారు.

మరిన్ని కోతలకు సిద్ధం

ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాల్లో మరింత కోత విధించేందుకు యాజమాన్యం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా అధికారులకు పెర్క్స్ తగ్గించడం, టౌన్‌షిప్‌లో నివసిస్తున్న కార్మికులకు విద్యుత్ చార్జీల పెంపు, పీఆర్‌పీ, ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్ తాత్కాలికంగా నిలుపుదల వంటి అనేక చర్యలకు రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. దీనిపై ఉక్కు యాజమాన్యం కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖకు వారం రోజుల్లో నివేదిక అందజేయనున్నట్టు తెలుస్తోంది. యాజమాన్యం చర్యల వల్ల 13,050 మంది ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోనున్నారు.

నిలిచిన సొసైటీ రుణాలు

ఇదిలా ఉండగా ఉద్యోగుల ఆర్థిక అవసరాలకు అండగా ఉండే పీఎఫ్, థ్రిఫ్ట్ సొసైటీలకు యాజమాన్యం సకాలంలో నగదు చెల్లించడం లేదు. దీంతో వాటి నుంచి కూడా ఉద్యోగులకు రుణాలు నిలిచి పోయాయి. దీంతో ఉద్యోగుల ఆర్థిక కష్టాలు మరింత పెరిగిపోయాయి.

కార్మిక సంఘాల ఆగ్రహం

ఉక్కు యాజమాన్యం నిర్ణయంపై కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే వేతన సవరణ జరగక అనేక సదుపాయాలు కోల్పోయిన ఉద్యోగులను పొదుపు చర్యల పేరిట వేధిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యాజమాన్యంతో అమీతుమీ తేల్చుకోవడానికి కార్మిక సంఘాలు సిద్ధమవుతున్నాయి.

వార్డు బాయ్ సూత్రధారి

- శిశువు విక్రయం కేసులో వెలుగులోకి విస్తుపోయే నిజాలు
- తల్లి అయిన బాలిక బంధువులను సంప్రదించిన కేజీహెచ్ వార్డు బాయ్
- ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్, మరో వ్యక్తితో బేరసారాలు
- ఓ జంటకు శిశువును విక్రయిస్తుండగా పోలీసులు దాడులు

బీచ్‌రోడ్డు/మహారాణిపేట : శిశువు విక్రయం కేసులో పోలీసులు విచారణ కొనసాగే కొద్దీ విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో కేజీహెచ్‌లో వార్డుబాయ్ సూత్రధారిగా తెలుస్తోంది. ప్రైవేటు ల్యాబ్ టెక్నీషియన్, మరో వ్యక్తి ద్వారా ఈ వ్యవహారం సాగినట్లు పోలీసులు గుర్తించారు. శనివారం రాత్రి శిశు విక్రయాల ముఠాపై పోలీసులు దాడి చేసి తొమ్మిది మందిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. పూర్తి స్థాయి విచారణ తర్వాత మరికొంత మంది నిందితులు బయటపడే అవకాశం ఉంది.

తల్లి అయిన మైనర్

కంచరపాలేనికి చెందిన బాలిక గర్భం దాల్చింది. ప్రసవం కోసం బాలిక కేజీహెచ్‌లో చేరిన సమయంలో సీటీ స్కాన్ వార్డు వద్ద బాయ్‌గా పనిచేస్తున్న బాల ఆమె పరిస్థితి గురించి తెలుసుకున్నాడు. ఈ క్రమంలో శిశువు విక్రయం గురించి బాలిక, ఆమె బంధువులతో చర్చించాడు. శిశువిక్రయాల్లో ఆరితేరిన ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్‌తో మాట్లాడించాడు. ఐదు నెలల శిశువు ఆరోగ్యం బాగోలేకపోవడం.. బాలిక తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి కూడా సరిగా లేకపోవడంతో రూ. 2 లక్షలకు బేరం పెట్టుకున్నారు.

శిశువు కోసం జంట సంప్రదింపులు

పదేళ్లగా సహజీవనం చేస్తున్న ఓ జంట పిల్లలను పెంచుకోవాలనుకున్నారు. వారు ఈ శిశు విక్రయాల ముఠాతో సంప్రదింపులు చేశారు. కేజీహెచ్‌లో మైనర్ జన్మనిచ్చిన శిశువు గురించి చెప్పటంతో కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చారు.

పోలీసుల దాడులు

ఆలిండియా రేడియో కేంద్రం సమీపంలో శిశువు అమ్మకం జరుగుతుందని పోలీసులకు సమాచారం అందడంతో శనివారం అర్ధరాత్రి స్పెషల్ బ్రాంచ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. 9 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రెండు చెక్కులు, ఆరు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. శిశువుని వైద్యం నిమిత్తం కేజీహెచ్ పిల్లల వార్డుకు తరలించారు.



పిల్లల వార్డు వద్ద మాట్లాడుతున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్

శిశు విక్రయాల మాఫియాపై సిట్

పోలీసులు లోతుగా విచారణ చేయగా ఈ కేసులో మరింత మంది ఉన్నారని బయటపడింది. ఈ రాకెట్ ఇతర రాష్ట్రాలకు విస్తరించిందని పోలీసులు గుర్తించారు. ఈ శిశు విక్రయాల మాఫియాను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి సిట్ ఏర్పాటు చేశారు.

తల్లీబిడ్డకు పరామర్శ : పిల్లల వార్డులో ఉన్న తల్లీబిడ్డను కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ సోమవారం పరామర్శించారు. వీరి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఐదు నెలల క్రితం కేజీహెచ్‌లో మైనర్ శిశువుకు జన్మనిచ్చిందని.. ఆ తర్వాత తల్లీబిడ్డను వారి బంధువులు ఇంటికి తీసుకువెళ్లిపోయారని ఆయన తెలిపారు. బయట జరిగిన పిల్లల విక్రయాలకు కేజీహెచ్‌కు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు.

పోలీసులు నిఘా పెంచాలి

పిల్లల అనధికార విక్రయాల ముఠాపై పోలీసులు మరింత నిఘా పెంచాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం కోరారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న తల్లీబిడ్డలను ఆయన పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఈ కేసును చేధించిన టాస్క్ ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్ పోలీసులను అభినందిస్తున్నామన్నారు.

న్యూస్‌రీల్

నులిపురుగుల నిర్మూలనపై అవగాహన కల్పించాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: జిల్లావ్యాప్తంగా ఈ నెల 20న జాతీయ నులిపురుగుల నిర్మూలన, 28న మాప్ అప్ డే కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ పేర్కొన్నారు. ఈ రెండు కార్యక్రమాలపై అంగన్వాడీ కేంద్రాలు, అన్ని పాఠశాలలు, కళాశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లోని విద్యార్థులకు, తల్లితండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో 1 నుంచి 19 ఏళ్ల లోపు వయసున్న వారు 5,20,891 మంది విద్యార్థులున్నారని, వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగన్నాథరావు, డీఈవో ఎల్.చంద్రకళ, డీఆర్డీఏ పీడీ శోభారాణి, ఐసీడీఎస్ పీడీ జయదేవి, అధికారులు కె.శ్రీదేవి, కె.రామారావు పాల్గొన్నారు.

స్కూల్ బస్సులు, ఆటోలపై కేసుల నమోదు



గంభీరం వద్ద స్కూల్ ఆటోలను తనిఖీ చేస్తున్న మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు

తగరపువలస: నిబంధనలు ఉల్లంఘించి నడుపుతున్న స్కూల్ బస్సులు, ఆటోలపై మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సోమవారం కేసులు నమోదు చేశారు. ఆనందపురం మండలంలోని ఆనందపురం, గంభీరం, బోయపాలెం వద్ద తనిఖీ అధికారులు బి.బాలాజీరావు, మాధవి, రాజారావు ఇన్‌స్పెక్టర్లు శిరీష, పార్వతి, దుర్గాప్రసాద్, సుమన్‌కుమార్ తనిఖీలు నిర్వహించారు. నగర పరిధిలో 4 స్కూల్ బస్సులు, 12 స్కూల్ ఆటోలపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

గ్రావెల్ తరలిస్తున్న వాహనాలు సీజ్



పెందుర్తి: స్థానిక నరవ సర్వే నంబర్ 29లోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న వాహనాలను రెవెన్యూ అధికారులు సోమవారం సీజ్ చేశారు. నరవలో గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న మండల తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్ ఆదేశాల మేరకు సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఒక జేసీబీ, ఒక లారీని పట్టుకుని సీజ్ చేశారు. ఆయా వాహనాలను పెందుర్తి పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

నేటి మధ్యాహ్నం 2.30 గం. వరకే అప్పన్న దర్శనాలు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనాలు మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటల వరకు మాత్రమే లభిస్తాయని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. సింహగిరి గ్రామ దేవతలు పాదాలమ్మ, బంగారమ్మ పండగ సందర్భంగా ఈ మార్పు చేసినట్టు పేర్కొన్నారు. తిరిగి బుధవారం ఉదయం 6.30 గంటల నుంచి యథావిధిగా దర్శనాలు లభిస్తాయన్నారు. బుధవారం ఉదయం సుప్రభాత సేవ, ఆరాధన టికెట్లను కూడా రద్దు చేసినట్టు తెలిపారు.

ఖతర్‌లో గాజువాక వాసి దుర్మరణం



శ్రీకిరణ్ (ఫైల్)

గాజువాక : స్థానిక శ్రీనగర్ ప్రాంతానికి చెందిన సివిల్ ఇంజినీర్ ఖతర్ రాజధాని దోహాలో దుర్మరణం చెందాడు. శనివారం చోటుచేసుకున్న ఈ సంఘటన ఆలస్యంగా తెలిసింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సివిల్ ఇంజినీర్ పి.శ్రీకిరణ్ (35) పదేళ్లుగా దోహాలోని ఒక కన్‌స్ట్రక్షన్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే శనివారం విధులకు వెళ్లాడు. అక్కడ ఎత్తులో పని చేస్తూ ప్రమాదవశాత్తు కింద నీటిలో పడిపోయినట్టు ఆ కంపెనీ ప్రతినిధుల నుంచి ఇక్కడి కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తొలుత సమాచారం వచ్చింది. అతడు మృతి చెందినట్టు సాయంత్రానికి తెలియజేసినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. శ్రీకిరణ్‌కు నాలుగేళ్ల క్రితం తనూజతో వివాహమైంది. వారికి ఒక బాబు ఉన్నాడు. వారు కూడా శ్రీనగర్‌లోనే నివాసమంటున్నారు. కాగా, శ్రీకిరణ్ మృతదేహాన్ని త్వరితగతిన ఇక్కడికి రప్పించాలని కోరుతూ కుటుంబ సభ్యులు జిల్లా కలెక్టర్‌కు విన్నవించుకున్నారు.

కేజీహెచ్‌లో పోలీస్ భద్రత



మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: కేజీహెచ్‌లో భద్రతకు ఎల్లవేళలా పోలీసులు అందుబాటులో ఉంటారని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. సోమవారం ఆంధ్రా మెడికల్ కాలేజ్ సమావేశ మందిరంలో నవజాత శిశువుల రక్షణ నిమిత్తం వైద్యులు, విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిశువుల కిడ్నాప్‌లను నిరోధించడానికి చేపట్టాల్సిన చర్యలు వివరించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, శిశు సంరక్షణ కేంద్రాల వద్ద ప్రైవేట్ సెక్యూరిటీ, తల్లులకు వసతి కల్పించే గదులు వంటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అనంతరం వైద్య విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. కేజీహెచ్ భద్రత విషయంపై వారు ప్రస్తావించగా.. ప్రైవేట్ ఆస్పత్రుల మాదిరిగా కేజీహెచ్ కూడా భద్రత కోసం సెక్యూరిటీ గార్డులను నియమించుకోవాలని సీపీ చెప్పారు. అవసరమైతే వారికి పోలీసుల ద్వారా శిక్షణ అందిస్తామన్నారు. ప్రైవేట్ సెక్యూరిటీతో పాటు ఒక పోలీస్‌ను ఎల్లవేళలా అందుబాటులో ఉంచుతామని చెప్పారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే 7995095799 నెంబర్‌కు తెలియజేయాలని సూచించారు.

15 నుంచి నేవీ మారథాన్ రిజిస్ట్రేషన్లు

విశాఖ స్పోర్ట్స్: తూర్పు నావికా దళం ఆధ్వర్యంలో మరోసారి వైజాగ్ నేవీ మారథాన్‌కు రంగం సిద్ధమైంది. డిసెంబర్ 15న ఈ పరుగు విశాఖ సాగరతీరం సాక్షిగా జరగనుంది. మారథాన్ 42 కిలోమీటర్ల పరుగును ఎయిర్‌క్రాఫ్ట్ కారియర్ రన్ పేరిట జరగనుండగా.. ప్రవేశ రుసుంగా రూ.1600 నిర్ణయించారు. 21 కిలోమీటర్ల పరుగు సబ్‌మెరైన్ రన్ పేరిట జరగనుండగా ప్రవేశ రుసుం రూ. 1400గా నిర్ణయించారు. 10 కిలోమీటర్ల పరుగును ఎయిర్‌క్రాఫ్ట్ రన్ పేరిట రూ.1000తో నమోదు చేసుకోవచ్చు. ఈ మూడు కేటగిరీల్లో విజేతలకు రూ.10 లక్షలు అందించనున్నారు. 5 కిలోమీటర్ల పరుగును ఫ్రిగేట్ రన్ పేరిట రూ. 600లతో నమోదు చేసుకోవచ్చు. ఈ నెల 15 నుంచి వైజాగ్ నేవీ మారథాన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్లు అందుబాటులో ఉంటాయి. పాల్గొన్న ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్‌తో పాటు జ్ఞాపిక అందించనున్నారు. టీషర్ట్‌తో స్నాక్స్‌ను పంపిణీ చేయనున్నట్టు రేస్ ఆర్గనైజర్ ఐఎన్ఎస్ కళింగ కమోడోర్ ప్రఫుల్ పటేల్ తెలిపారు. వీఎంఆర్‌డీఏ పార్కు ఎంజీఎం లాన్స్ నుంచి రన్ ప్రారంభమై ఆర్‌కే బీచ్ వరకు సాగనుంది. జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ నేవీ మారథాన్ లోగోను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రేస్ డైరెక్టర్ కెప్టెన్ టీకే తివారి, పీఆర్‌వో సీజీ రాజు, టీఆర్ఎస్ కుమార్ పాల్గొన్నారు.

లారీలో మంటలు



మంటల్లో దగ్ధమవుతున్న లారీ

మద్దిపాలెం: విజయనగరం నుంచి తాటిచెట్లపాలెం మీదుగా గ్రావెల్ లోడుతో వెళుతున్న లారీ కప్పరాడ ప్రాంతానికి చేరుకోగానే ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. సోమవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. మంటలు గమనించిన డ్రైవర్ నితీష్‌కుమార్ సింగ్ లారీని పక్కకు ఆపి ఫైర్ సిబ్బందికి సమాచారం అందించాడు. అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైర్ ఇంజన్‌లతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించినట్టు ప్రాథమిక సమాచారం. ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై ట్రాఫిక్ పోలీసులకు కోరగా, వారికి ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

తవ్వే కొద్దీ నష్టాలే.!



సముద్రంలో సిల్ట్ తీస్తున్న డ్రెడ్జర్ (ఫైల్)

- తొలి త్రైమాసికంలో కుదేలైన డ్రెడ్జింగ్ కార్పొరేషన్
- ఇతర సంస్థలకు సబ్ కాంట్రాక్టర్లు ఇవ్వడం వల్లే నష్టాలు
- మూడు నెలలుగా సీల్డ్ కవర్లోనే కొత్త ఎండీ నియామకం
- ఇన్‌చార్జ్ బదులుగా మొత్తం తానై నడుపుతున్న షాడో ఎండీ

సాక్షి, విశాఖపట్నం : డ్రెడ్జింగ్ కార్పొరేషన్ వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. సంస్థలో అధికారులు స్వలాభం కోసం సంస్థకు నష్టాలు తెస్తున్నారు. అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో తొలి త్రైమాసికంలో డీసీఐ తీవ్ర నష్టాలను చవిచూసింది. ఏడేళ్ల క్రితం డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌ని ప్రైవేట్‌పరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అడుగులు వేసినప్పుడు..విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ) డీసీఐ బాధ్యతని తన భుజస్కంధాలకెత్తుకుంది. దీంతో ప్రైవేటీకరణ నిర్ణయం ఆగిపోయింది. ఆ తర్వాత లాభాల బాటలో పయనించింది. మూడేళ్ల క్రితం ఎండీ, సీఈవో నియామకంలో అవకతవకలు జరిగిన విషయం వెలుగులోకి రావడంతో విజిలెన్స్ విచారణ నిర్వహించారు. ఎండీని తొలగించడం, తర్వాత ఆయన స్థానంలో వచ్చిన కొత్త ఎండీ పదవీ కాలం అయిపోవడం చకచకా జరిగిపోయాయి. ఇక అక్కడ నుంచి డ్రెడ్జింగ్ కార్పొరేషన్ పతనం మొదలైంది. కొత్త ఎండీ, సీఈవోని ఇంతవరకూ నియమించకుండా పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబేకు తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. డ్రెడ్జింగ్‌పై పూర్తిగా పట్టులేని దూబేని కేవలం పోర్టుకు మాత్రమే పరిమితం చేస్తూ షాడో ఎండీలు రాజ్యమేలుతున్నారు.

సబ్ కాంట్రాక్టులతో నష్టాల్లోకి..

డీసీఐ 2023–24 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంగా రూ.15 కోట్లకు పైగా నికర లాభాల్ని ఆర్జించింది. ఈ ఏడాది మాత్రం ఏకంగా రూ.31 కోట్ల నష్టాలను మూటకట్టుకుంది. కేవలం అధికారుల తీరు కారణంగానే సంస్థకు నష్టాలు వస్తున్నాయని స్పష్టమవుతోంది.

ప్రస్తుతం డీసీఐకి 10 ప్రధానమైన డ్రెడ్జర్లున్నాయి. వీటిలో 6 వరకూ మరమ్మతులకు గురయ్యాయంటూ కుంటి సాకులు చెబుతున్నారు. ఇటీవల కొనుగోలు చేసిన కొత్త డ్రెడ్జర్లు సైతం రిపేర్లకు వెళ్లిపోయాయని అబద్ధాలు చెబుతున్నారన్న విమర్శలొస్తున్నాయి. ప్రతి డ్రెడ్జర్‌ని ఏడాదికి 3 నెలల పాటు రిపేర్లంటూ నిలిపేస్తున్నారు. డ్రెడ్జర్లు లేకపోవడంతో వచ్చిన కాంట్రాక్టుని సబ్ కాంట్రాక్టు కింద ఇతర సంస్థలకు అప్పగించేస్తున్నారు. ఫలితంగా 100 శాతం రావాల్సిన ఆదాయం 10 శాతం మాత్రమే డీసీఐకి దక్కుతోంది.

సిబ్బంది కొరతతో పనిభారం

షిప్పింగ్ స్టాఫ్ 800 మంది వరకూ ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 60 శాతం మాత్రమే ఉన్నారు. అదే విధంగా ఫ్లోటింగ్ స్టాఫ్ 300కి గాను 150 మంది ఉన్నారు. కొత్తవారిని నియమించేందుకు హెచ్‌ఆర్ విభాగం ఏడాదికిపైగా నోటిఫికేషన్ ఇస్తున్నా ఇక్కడ రాజకీయాలు తెలుసుకున్న వారెవ్వరూ విధుల్లో చేరేందుకు ఆసక్తి చూపించడం లేదు. ప్రస్తుతం ఉన్న స్టాఫ్ కూడా డీసీఐలో పని చేయలేమంటూ వేరే సంస్థలకు వెళ్లిపోతున్నారు.

ఇలా బదిలీ.. అలా వచ్చేశారు.!

డీసీఐలో ఇటీవల జరిగిన బదిలీల్లో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారాయనే ఆరోపణలున్నాయి. షాడో ఎండీ ఈ వ్యవహారాల్ని నడిపించినట్లుగా తెలుస్తోంది. పదోన్నతులు ఇస్తే కచ్చితంగా వివిధ బ్రాంచ్‌లకు బదిలీ చేయాలన్న నిబంధన ఉంది. కానీ కొందరికి ప్రమోషన్లు ఇవ్వకుండానే ట్రాన్స్‌ఫర్ చేసిన ఉన్నతాధికారులు.. ఒక్కరి విషయంలో మాత్రం నిబంధనలకు నీళ్లొదిలేశారు. కుటుంబ పరిస్థితుల కారణంగా బదిలీ చెయ్యొద్దని మొరపెట్టుకున్నా నలుగురు మహిళలను కొచ్చి, కోల్‌కతా ట్రాన్స్‌ఫర్ చేశారు. పదోన్నతి తీసుకొని డీజీఎం హోదాలో ఉన్న వ్యక్తిని కూడా బదిలీ చేసినట్లే చేసి.. ఆర్డర్ ఆయన చేతికి వచ్చేలోపే ట్రాన్స్‌ఫర్‌ని నిలిపేశారు. ఇలా అన్ని విభాగాల్లోనూ డీసీఐని నిర్వీర్యం చేస్తున్నా పోర్టు అధికారులు కనీసం పట్టించుకోకపోవడంపై ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంతా ఆయన కనుసన్నల్లోనే..

ప్రస్తుతం పోర్టు డిప్యూటీ చైర్మన్‌గా ఉన్న దుర్గేష్‌కుమార్ దూబేకి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఎండీ నియామకానికి సంబంధించిన ఇంటర్వ్యూలు పూర్తయితే ముగ్గురు అధికారుల పేర్లు సీల్డ్ కవర్లో ఉంచారు. ఇది గడిచి మూడు నెలలు పైబడినా ఇప్పటికీ వారిలో ఒకరినైనా నియమించలేదు. జవహర్‌లాల్ నెహ్రూ పోర్టు అథారిటీకి చెందిన డిప్యూటీ కన్జర్వేటర్, ఐఆర్ఎంఎస్‌కి చెందిన సీవీవోతో పాటు గతంలో డీసీఐలో కెప్టెన్‌గా వ్యవహరించిన మరొకర్ని ఎంపిక చేశారు. వీరిలో ఒకర్ని నియమించాలి. కానీ ఇంత వరకూ చేపట్టలేదు. ఫలితంగా డీసీఐలో ఓ కెప్టెన్ స్థాయి ఉన్నతాధికారి షాడో ఎండీగా వ్యవహరిస్తూ పనులన్నీ చక్కబెట్టేస్తున్నారు. ఇదిలావుంగా డీసీఐకి ఆయువుపట్టులాంటి మానవ వనరుల విభాగం(హెచ్‌ఆర్) కొందరు సీనియర్ల చేతిలో కీలుబొమ్మగా మారిపోయిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కండి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

విశాఖ సిటీ: పోలీస్ శాఖలో పని చేసి ఉద్యోగ విరమణ పొందిన అధికారులు, సిబ్బంది సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. పోలీస్ సమావేశ మందిరంలో సోమవారం రిటైర్డ్ పోలీస్ సంఘం సభ్యులతో సీపీ ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. పాపా హోం మాదిరిగా ఉద్యోగ విరమణ పొందిన వారు అనాథలను దత్తత తీసుకొని పెంచే విధంగా ప్రయత్నించాలన్నారు. అలాగే డ్రగ్స్, ఇతర మాదక ద్రవ్యాలకు బానిసలుగా ఉన్న వారిని మార్చే డీఅడిక్షన్ సంస్థల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగుల నుంచి సీపీ వినతులు స్వీకరించారు.

ఎయిడ్స్ నియంత్రణకు విస్తృత ప్రచారం

మహారాణిపేట: జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణకు అధికారయంత్రాంగం విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచించారు. ఈనెల 12 నుంచి 8 వారాల పాటు డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం సారథ్యంలో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఒక్కో వారం ఒక్కో నినాదంతో ప్రచారం కొనసాగుతోందని తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎయిడ్స్ నియంత్రణ విభాగం రూపొందించిన 'మీ కోసం' పోస్టర్‌ను, ×మీకు తెలుసా..?లోగోను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణపై ప్రతి ఒక్కరికీ అవగాహనా కల్పించాలన్నారు. ఎన్జీవోల సహకారంతో సెక్స్ వర్కర్లకు, డ్రైవర్లకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, జిల్లాలోని హాట్ స్పాట్స్‌ను గుర్తించాలని ఆదేశించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ పూర్ణేంద్ర బాబు, డీఈవో ఎల్.చంద్రకళ, డీఆర్డీఏ పీడీ ఎం.శోభారాణి, ఐసీడీఎస్ పీడీ జి.జయదేవి, బీసీ సంక్షేమం, సాంఘిక సంక్షేమ శాఖాధికారులు కె.శ్రీదేవి, కె.రామారావు, ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

యాచకులకు 'స్మైల్'గా ప్రత్యామ్నాయ ఉపాధి

సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న 'సపోర్టు ఫర్ మార్జినలైజ్డ్ ఇండివిజువల్స్ ఫర్ లైవ్లీహుడ్ అండ్ ఎంటర్‌ప్రైజ్(ఎస్ఎంఐఎల్ఈ–స్మైల్)' పథకం ద్వారా యాచకులకు ప్రత్యామ్నాయ జీవనోపాధి చూపాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ కోరారు. సోమవారం సాయంత్రం వివిధ విభాగాల అధికారులతో తన చాంబర్‌లో కలెక్టర్ సమావేశమయ్యారు. స్మైల్ పథకం ప్రయోజనాలు, తద్వారా చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. యాచకుల సమగ్ర పునరావాసం కోసం అధికారులు కృషి చేయాలని సూచించారు. నగర పరిధిలోని యాచకులను గుర్తించి, పునరావస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు, సీపీవో శ్రీనివాసరావు, డిజేబుల్డ్ ఏడీ మాధవి, యూసీడీ పీడీ ఫణిరాం, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, డీపీవో శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

15న సిసోడియా రాక

మహారాణిపేట: రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ రెవెన్యూ ఆర్‌పీ సిసోడియా ఈనెల 15న విశాఖ వస్తున్నారు. 16న విజయనగరం, 17న విశాఖలో జరిగే రెవెన్యూ సదస్సులో పాల్గొంటారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొని 18న విశాఖ నుంచి రోడ్డు మార్గంలో విజయవాడ వెళతారు.

రెండు రెస్టారెంట్లకు జరిమానా

టీచ్‌రోడ్డు: నగరంలో పలు రెస్టారెంట్లపై సోమవారం ఫుడ్‌సేఫ్టీ అధికారులు దాడులు చేశారు. పాత జైలు రోడ్డులో ఇన్నోసెంట్ బ్యాచిలర్, రామ్ నగర్‌లోని గ్రీన్ వ్యాలీ రెస్టోకేఫ్‌పై డివిజన్–3 ఫుడ్ సేఫ్టీ అధికారి జీవీ అప్పారావు దాడులు నిర్వహించారు. నిల్వ చేసిన ఆహారాన్ని గుర్తించి కేసులు నమోదు చేసి జరిమానా విధించారు. దుర్వాసన వస్తున్న చికెన్, మసాలా పేస్ట్, లాలీపాప్‌లను గుర్తించారు.

ఆకట్టుకున్న ఫ్లాష్‌మాబ్



ప్లకార్డులతో విద్యార్థులు, ఏయూ అధికారులు

మద్దిలపాలెం: జాతీయ నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా సోమవారం ఆంధ్రాయూనివర్సిటీ డాక్టర్.బి.ఆర్.అంబేడ్కర్ చైర్‌లో ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న 1500 మంది విద్యార్థులు జాతీయ పతాకాలతో ప్రదర్శనల నిర్వహించారు. లా కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు డ్రగ్స్ వినియోగం–నష్టాలపై స్కిట్స్, ఫ్లాష్‌మాబ్‌తో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏయూ ప్రొఫెసర్లు ఎ.నరసింహారావు, కె.సీతామాణిక్యం పాల్గొన్నారు.

పర్యాటకులను ఆకర్షించేలా సౌకర్యాలు

విశాఖ సిటీ: పర్యాటకులను ఆకర్షించేలా వీఎంఆర్‌డీఏ పార్కులు, పరిసర ప్రాంతాలను తీర్చిదిద్దాలని, మెరుగైన సౌకర్యాలు కల్పించాలని వీఎంఆర్‌డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన తెన్నేటి పార్క్‌లో బిగ్ స్క్రీన్ స్టేజ్ పరిసరాలను పరిశీలించారు. చక్కటి కళాకృతులతో తీర్చిదిద్ది సందర్శకులను ఆకర్షించే విధంగా పచ్చదనంతో నింపాలని చెప్పారు. ఎక్కడికక్కడ డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసి చెత్త తరలించాలన్నారు. నడకదారులు, గోడలకు అతికించిన పాడైన టైల్స్‌ను తక్షణమే మార్చాలని, గోడలకు చక్కని థీమ్ పెయింటింగ్స్ వేయించాలని సూచించారు. పాడైన గార్డెనింగ్ విద్యుత్ దీపాలు, బెంచీలను మార్చి సందర్శకులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. హ్యాండ్ రైలింగ్‌కు జరుగుతున్న మరమ్మతులను పరిశీలించారు. అనంతరం బీచ్ రోడ్‌లోని సీ హారియర్ మ్యూజియాన్ని సందర్శించి అక్కడ ఉన్న ఆర్టీఫ్యాక్ట్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ స్తంభాలకు ఉన్న తుప్పును తొలగించి పెయింటింగ్ చేయించాలని, సందర్శకులకు తాగునీరు, మెరుగైన పారిశుధ్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ పర్యటనలో వీఎంఆర్‌డీఏ సీఈ భవానీ శంకర్, డీఎఫ్‌వో శాంతి స్వరూప్, పర్యవేక్షక ఇంజినీర్ బలరామరాజు, కార్యనిర్వాహక ఇంజినీర్లు రాజు, రామరాజు, రేంజ్ ఆఫీసర్ శ్యామల, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ మురళి, మోహనరావు, సహాయక ఇంజనీర్ హసీనా బేగం పాల్గొన్నారు.

ఉచిత బస్సు ప్రయాణంపై పునరాలోచించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐటీయూసీ నేతలు, కార్మికులు

సీతమ్మధార : రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం కారణంగా ఆదాయం కోల్పోయే ఆటోడ్రైవర్లకు ప్రత్యామ్నాయం చూపించాలని ఏపీ ఆటో డ్రైవర్లు, వర్కర్ల సమాఖ్య (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం ఆటోడ్రైవర్లు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వామనమూర్తి మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణంలో ఆటోడ్రైవర్ల ఆదాయం గణనీయంగా తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కర్నాటక రాష్ట్రంలో ఇటువంటి పథకం కారణంగా అక్కడి ఆర్టీసీ నష్టాల్లో కూరుకుపోయిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ పథకం పట్ల రాష్ట్రప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. అలాగే, రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధి పేరిట టోల్‌గేట్ల ఏర్పాటు ప్రతిపాదనలు విరమించుకోవాలని కోరారు. విజయనగరం జిల్లా జొన్నాడ, అగనంపూడి టోల్‌గేట్లను వెంటనే ఎత్తివేయాలని, లేనిపక్షంలో దశలవారీగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ , సమాఖ్య నాయకులు చంటి అప్పలరాజు, రవికృష్ణ, శంకర్, కే.సన్యాసిరావు, ఎస్.చెన్నారెడ్డి, ఎల్.గోవింద్, బంగారయ్య, వై.వెంకట్, ఎంఏ ఖాన్, అప్పలరాజు, లక్ష్మణరావు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

మా స్థలం రైల్వేకు కేటాయిస్తే సహించం

- రామకృష్ణాపురం గిరిజనుల ఆందోళన
- చదును చేస్తున్న పనుల అడ్డగింత



జేసీబీకి అడ్డంగా నిలిచిన గిరిజన మహిళలు

ఆరిలోవ: ముడసర్లోవ వద్ద రైల్వే శాఖకు జీవీఎంసీ కేటాయించిన స్థలం వ్యవహారం ఇప్పటికీ వివాదంగానే మిగిలిపోయింది. సుమారు 15 ఏళ్లుగా సాగుతున్న ఈ వ్యవహారం ఇప్పటికీ కొలిక్కి రాలేదు. సదరు స్థలాన్ని రైల్వేకు కేటాయిస్తే సహించేది లేదంటూ తాజాగా జేసీబీతో చేపడుతున్న పనులను రామకృష్ణాపురం గిరిజనులు అడ్డుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. జీవీఎంసీ అధికారులు ముడసర్లోవ ప్రాంతం రామకృష్ణాపురం వెనక ఖాళీ స్థలాన్ని రైల్వేకు కొన్నేళ్ల క్రితం కేటాయించారు. అయితే ఆ స్థలం తమ పూర్వీకులకు వ్యవసాయం చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని ఇక్కడ శ్రీకృష్ణాపురం గిరిజనులు కొన్నాళ్లుగా జీవీఎంసీ అధికారులు, కలెక్టర్‌కు విన్నవిస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర కారాగారం ఎదురుగా బీఆర్‌టీఎస్ నుంచి రైల్వేకు కేటాయించిన స్థలానికి రోడ్డు వేయడానికి టౌన్ ప్లానింగ్ అధికారులు సోమవారం జేసీబీతో చదును చేసే పనులు చేపట్టారు. విషయం తెలుసుకున్న శ్రీకృష్ణాపురం గిరిజనులు పనులను అడ్డుకున్నారు. దీనిపై తాము కోర్టుకు వెళ్లామని అధికారులతో వాగ్వాదం చేశారు. ఈ పనులు జరగనీయబోమంటూ జేసీబీకి అడ్డు తగిలారు. జోన్–2 ఏసీపీ శాస్త్రి సూచనలతో టీపీవో వరప్రసాద్ తదితరులు వారితో మాట్లాడారు. ఏమైనా ఆధారాలు ఉంటే ఉన్నతాధికారులకు చూపాలని, పనులు ఆపడం మంచి పద్ధతి కాదని గిరిజనులకు సూచించారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తామని అధికారులు సర్ది చెప్పడంతో గ్రామస్తులు శాంతించారు. అనంతరం రోడ్డు పనులను యథావిధిగా కొనసాగించారు.

అప్పులు తీర్చలేక రియల్టర్ ఆత్మహత్య

పీఎంపాలెం : తలకు మించిన అప్పులతో బాధపడుతున్న ఓ రియల్టర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఇందుకు సంబంధించి పీఎంపాలెం సీఐ వై. రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డొంకాడ అనిల్ కుమార్ (42) పీఎం పాలెం రెండో బస్టాపుదరిలో కుటుంబంతో నివసిస్తున్నాడు. వ్యాపారంలో భారీగా నష్టపోయాడు. రూ.38 లక్షలు వరకూ అప్పుల్లో కూరుకుపోయాడు. సోమవారం ఉదయం 10.45 గంటల సమయంలో భార్య వసంత పిల్లలకు క్యారేజీ ఇవ్వడానికి స్కూలుకు వెళ్లింది. ఆమె లేని సమయంలో బెడ్ షీటుతో ఫ్యాన్ హుక్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పులు తీర్చే మార్గం లేక , ఒత్తిడి భరించలేక చనిపోతున్నానని సూసైడ్ నోట్ రాశాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. వసంత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

మరికొంత కాలం ప్రత్యేక రైళ్ల పొడిగింపు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు మార్గాలలో ప్రస్తుతం నడుస్తున్న పలు ప్రత్యేక రైళ్లు మరికొంతకాలం పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. ఎర్నాకుళం–పాట్నా(06085) అన్‌రిజర్వుడు సమ్మర్ స్పెషల్ రైలు ప్రతీ శుక్రవారాల్లో రాత్రి 11గంటలకు ఎర్నాకుళంలో బయల్దేరి మరుసటిరోజు రాత్రి 11.05 గంటలకు దువ్వాడ చేరుకుని, 11.07 గంటలకు బయల్దేరి సోమవారాల్లో తెల్లవారు 3.30గంటలకు పాట్నా చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు సెప్టెంబరు 6వ తేదీ వరకు నడుస్తాయి. తిరుగు ప్రయాణంలో పాట్నా–ఎర్నాకుళం(06086) అన్‌రిజర్వుడు సమ్మర్‌స్పెషల్ ప్రతీ సోమవారాల్లో పాట్నాలో రాత్రి 11.45గంటలకు బయల్దేరి బుధవారాల్లో తెల్లవారుజామున 1.05గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. 1.07గంటలకు బయల్దేరి గురువారాల్లో ఉదయం 10.30గంటలకు ఎర్నాకుళం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు సెప్టెంబరు 9వ తేదీ వరకు నడుస్తాయి. కోయంబత్తూర్– బరౌని (06059) స్పెషల్ కోయంబత్తూర్‌లో ప్రతి మంగళవారాల్లో ఉదయం 11.50 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 10.48గంటలకు దువ్వాడ చేరుకుని, 10.50గంటలకు బయల్దేరి గురువారాల్లో మధ్యాహ్నం 2.30గంటలకు బరౌని చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు సెప్టెంబరు 3వ తేదీ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో బరౌని–కొయంబత్తూర్ (06060) స్పెషల్ కోయంబత్తూర్‌లో శుక్రవారాల్లో రాత్రి 11.45గంటలకు బయల్దేరి మూడో రోజు తెల్లవారుజామున 3.48గంటలకు దువ్వాడ చేరుకుని, 4గంటలకు బయల్దేరి మరుసటిరోజు (నాల్గవరోజు) తెల్లవారుజామున 3.45గంటలకు కొయంబత్తూరు చేరుకుంటుంది. కోయంబత్తూర్–ధన్‌బాద్(06063) స్పెషల్ కోయంబత్తూర్‌లో ప్రతీ శుక్రవారం ఉదయం 11.50 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 10.48 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 10.50గంటలకు బయల్దేరి ఆదివారాల్లో ఉదయం 8.30గంటలకు ధన్‌బాద్ చేరుకుంటాయి. ఈ స్పెషల్ రైళ్లు సెప్టెంబరు 6వ తేదీ వరకు నడుస్తాయి. తిరుగు ప్రయాణంలో ధన్‌బాద్–కొయంబత్తూర్(06064) స్పెషల్ ప్రతీ సోమవారాల్లో ఉదయం 6గంటలకు ధన్‌బాద్‌లో బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 3.58 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 4గంటలకు బయల్దేరి బుధవారాల్లో తెల్లవారుజామున 3.45 గంటలకు కోయంబత్తూర్ చేరుకుంటాయి. ఈ స్పెషల్‌రైళ్లు సెప్టెంబరు 9వ తేదీ వరకు నడుస్తాయి. తిరునల్వేలి–షాలిమర్ (06087) స్పెషల్ ప్రతీ గురువారాల్లో తెల్లవారు 1.50గంటలకు తిరునల్వేలిలో బయల్దేరిమరుసటిరోజు తెల్లవారు 4.57గంటలకు దువ్వాడ చేరుకుని అక్కడ నుంచి 5.02గంటలకు బయల్దేరి శుక్రవారాల్లో రాత్రి 9గంటలకు షాలిమర్ చేరుకుంటాయి. ఈ స్పెషల్ రైళ్లు సెప్టెంబరు 5వ తేదీ వరకు నడుస్తాయి. తిరుగు ప్రయాణంలో షాలిమర్–తిరునల్వేలి(06088)స్పెషల్ ప్రతీ శనివారాల్లో సాయంత్రం 5.10గంటలకు షాలిమర్‌లో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7.52గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 7.57గంటలకు బయల్దేరి మరుసటిరోజు (సోమవారం) మధ్యాహ్నం 1.15 గంటలకు తిరునల్వేలి చేరుకుంటాయి. ఈ స్పెషల్ రైళ్లు సెప్టెంబరు 7వ తేదీ వరకు నడుస్తాయి.

దంచికొట్టిన వాన



జోరుగా కురుస్తున్న వర్షం

సాక్షి, విశాఖపట్నం : వారం రోజులుగా ఉక్కపోతతో విలవిల్లాడిన నగరవాసులకు కాస్తా ఊరట దక్కింది. ఉదయమంతా ఉడికించిన వాతావరణం .. రాత్రి 8 గంటల సమయంలో ఒక్కసారిగా చల్లబడింది. నగరంలో పలు చోట్ల కురిసిన వర్షంతో ప్రజలు ఉపశమనం పొందారు. హఠాత్తుగా కురిసిన వర్షంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలు చోట్ల రహదారులపై నీరు నిలిచిపోవడంతో.. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

వర్షపాతం వివరాలు (మి.మీ) : భీమిలి–15,ఆనందపురం–14.5,పెందుర్తి–13.5,సుజాతనగర్–8.5, గోపాలపట్నం–6,దువ్వపాలెం–4.75,అక్కిరెడ్డిపాలెం–4.